క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత జయంతి



సంతోషిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: సంతోషిమాత అమ్మవారి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కె.జె.పురం జంక్షన్‌లోని అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు ఆధ్వర్యంలో మాలాధారణ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీ వరకు మాలాధారణలో భక్తులు నిష్టతో పూజలు చేసి, అదే రోజు ఆలయం వద్ద ఇరుముడులు సమర్పిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షులు అమ్మతల్లినాయుడు తెలిపారు.

తప్పులు లేకుండా ఓటర్ల జాబితా



జోగుంపేటలో ఓటర్లతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

గొలుగొండ: ఓటర్లు జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదని, బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. జోగుంపేట, ఏఎల్‌పురం ప్రాంతాల్లో బుధవారం ఆయన ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఇటీవల మరణించిన ఓటర్ల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ

నర్సీపట్నం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు తెలిపారు. కంప్యూటర్స్, బ్రైనీబ్యూటీషన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ప్రముఖ కెంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమృతరావుకు ఉత్తమ కవి పురస్కారం



కె.కోటపాడు: ఎ.కోడూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జె.అమృతరావు ఉత్తమ కవి పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఎస్‌బీఎస్ కవి పత్రిక ఆన్‌లైన్‌లో తెలుగు కవితల పోటీలను నిర్వహించింది. అమృతరావు తెలుగు శోభపై రాసిన కవితకు పురస్కారం లభించింది. ఐఎస్‌బీఎస్ కవి పత్రిక సంపాదకులు దేవరపు ఈశ్వరరావు ప్రశంసాపత్రాన్ని పంపారు.

మురుగు నీరు నిల్వలేకుండా చూడాలి



దోమల మందును వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న త్రినాథ్

కె.కోటపాడు : ఇళ్ల పరిసరప్రాంతాల్లో ఉన్న మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. దోమకాటు వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆనందపురంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన బుధవారం వివరించారు. ఏఎన్ఎం కె.పద్మ, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

వడ్డాదిలో పారిశుధ్య చర్యలు



వడ్డాదిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈవో లవరాజు తమ సిబ్బందితో కాలువల్లో పూడికలు తీయించి, మురికి గుంటల్లో వర్షం నీరు నిల్వ లేకుండ కుండా చర్యలు చేపట్టారు. ఫాగింగ్ మెషీన్‌తో పలు వీధుల్లో మలాథియన్ స్ప్రే చేయించారు.

చురుగ్గా పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణం

- డిప్యూటీ సీఎం బూడి చొరవతో రూ.1.70 కోట్లు మంజూరు
- ఇప్పటికే రూ. 50 లక్షలతో నాడు–నేడులో ఆధునికీకరణ పనులు పూర్తి



పీహెచ్‌సీ భవనం



దేవరాపల్లి పీహెచ్‌సీ ఆవరణలో జరుగుతున్న అదనపు భవన నిర్మాణ పనులు

దేవరాపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పీహెచ్‌సీ ఆవరణలో అదనపు భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

దీంతో దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి భవనాల కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో ప్రస్తుత భవనాన్ని రూ. 50 లక్షలతో ఆధునికీకరించి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రూ.1.70 కోట్ల వ్యయంతో అదనపు భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పట్ల మండల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఏజెన్సీకి ముఖ్యం ద్వారంగా ఉన్న దేవరాపల్లి పీహెచ్‌సీకి అల్లూరి జిల్లా అనంతగిరి మండలంతో పాటు విజయనగరం జిల్లా వేపాడ మండలాల నుంచి సైతం ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందుతారు.

దివ్యాంగుల క్రీడా పోటీల్లో ఎ.కొత్తపల్లి విద్యార్థుల సత్తా

- రన్నింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం
- షార్ట్‌పుట్, స్లో వాక్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సొంతం



డీఈవో చేతులు మీదుగా బహుమతులను అందుకుంటున్న విద్యార్థులు



జిల్లా స్థాయి దివ్యాంగ క్రీడా పోటీలలో గెలుపొందిన ఎ. కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు

దేవరాపల్లి: జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రోటరీ క్లబ్ విశాఖ సెంటీనియల్ వారి సమన్వయంతో ఏపీ ప్రభుత్వ సమగ్ర శిక్ష, అనకాపల్లి జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఎ.కొత్తపల్లికి చెందిన విద్యార్థులు ప్రవీణ్, రమ్య, చంద్రశేఖర్ రన్నింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. షార్ట్‌పుట్‌లో భార్గవనాయుడు ప్రథమ స్థానంలోను, స్లో వాక్‌లో తనూజ్, ధనుంజయరావులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ గాయత్రిని ఏ.కొత్తపల్లి హైస్కూల్ హెచ్‌ఎం వై. స్వర్ణలత అభినందించారు.

చిన్నారుల్లో అక్షర జ్ఞానం కల్పించాలి

రోలుగుంట: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు అక్షర జ్ఞానం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు రోలుగుంట సెక్టారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమ సూచించారు. రోలుగుంట సెక్టార్ పరిధిలో గల అంగన్‌వాడీ టీచర్ల నెలవారీ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఏ విధమైన లోపాలున్నా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యం పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం కార్యవర్గం



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం సభ్యులు

బుచ్చెయ్యపేట: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల మండల సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ రాంబాబు ఎన్నికయ్యారు. వడ్డాదిలో బుధవారం సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సూర్యనారాయణ, కోశాధికారిగా రఘు,కార్యవర్గ సభ్యులుగా పి.ఎం.ఎస్.రమణ, జాజిమొగ్గల శ్రీను ఎన్నికయ్యారు. జిల్లా సంఘం కార్యదర్శి టి.వరప్రసాద్ తదితరులు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

సక్రమంగా గర్భిణులు, బాలింతల వివరాల నమోదు



ఏఎన్ఎంలు, ఎంఎల్‌పీహెచ్‌లకు శిక్షణ ఇస్తున్న మోహన్‌రావు

మాడుగుల రూరల్: గర్భిణులు, బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి, అప్‌లోడ్ చేయాలని వైద్యఆరోగ్య శాఖ మొబైల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ కె.మోహన్‌రావు తెలిపారు. కేజే పురం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌పీహెచ్‌లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, కౌమార బాలికలు స్థితిగతులు, ఇతర ప్రజా ఆరోగ్య కార్యక్రమాల వివరాలను స్మార్ట్ ఫోన్‌లో ఏవిధంగా నమోదు చేయాలో వివరించారు. ఈ శిక్షణలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు, కమ్యూనిటీ హెల్త్ అధికారిణి సీహెచ్ పుష్పమ్మ, ఎంపీహెచ్‌ఈవో పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చీడికాడ: మండలంలోని మంచాల మోడల్‌స్కూల్‌ను డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఎల్‌ఐపీ తరగతుల అమలు,బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, మెనూ అమలు తీరు, హాస్టల్, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు.

వేములపూడి హైస్కూల్‌కు క్రీడా పురస్కారం



కలెక్టర్ రవి పటాన్‌శెట్టి చేతుల మీదగా పురస్కారం అందుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: వేములపూడి పీబీఎం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి చేతుల మీదగా క్రీడా పురస్కారం అందుకున్నారు. 2022–23 సంవత్సరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలను క్రీడా పురస్కారాలకు ఎంపిక చేశారు. దీనిలో భాగంగా పీబీఎం జెడ్పీ హైస్కూల్ 120 పాయింట్లతో మొదటి బహుమతి సాధించింది. క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న కలెక్టర్ చేతుల మీదగా విద్యార్థులు క్రీడా పురస్కారం అందుకున్నారు. విద్యార్థులతో పాటు హెచ్‌ఎం రామకృష్ణ, పీడీలు రవి, సుమన్‌లను కలెక్టర్ సన్మానించారు. విద్యార్థులను పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వరి, వేరుశనగ పంటల పరిశీలన



మేడివాడలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రావికమతం: మేడివాడ,రావికమతం గ్రామాల్లో వరి,వేరు శనగ పంటలను కొండెంపూడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, సౌజన్య, మండల వ్యవసాయాధికారి తులసి బుధవారం పరిశీలించారు. మేడివాడలో వేరుశనగ పంటలో సూక్ష్మ పోషక లోపాన్ని గుర్తించారు. నివారణకు గాను ఫార్ములా–4 పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మెట్ట భూముల్లో నీరు లేక పోవడంతో వరిలో కలుపు ఎక్కువగా ఉందని గమనించారు. వరినాటిన 15 నుంచి 25 రోజుల వ్యవధిలో పోటాష్ లోప నివారణకు మల్టీకే 13.0.45ను పిచికారీ చేయాలని సూచించారు. కొబ్బరిలో పిందె రాలకుండా బోరాక్స్ 100 గ్రాములు,జింక్ సల్ఫేట్100 గ్రాములు చెట్టుకు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకె సిబ్బంది వంశీప్రియ,మంగరాజు,శ్రావణి,జగ్గారావు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మాడుగుల: మండలంలోని డి.గొటివాడలో బుధవారం ఓ పశువులు పాక దగ్ధమైంది. మాడుగుల అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణపై స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వి.రాజేశ్వరరావు, ఎల్ఎఫ్ కృష్ణ, ఫైర్‌మన్‌లు మణికుమారి, చిన్నంనాయుడు, నానాజీ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షల మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్, మెటల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులలో ఉపాధి హామీ పథకం నుంచి 75 శాతం, మిగతా 25 శాతం మండల పరిషత్, జిల్లా పరిషత్ నుంచి కేటాయించినట్టు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి ఆయా గ్రామస్తులు తీసుకొచ్చిన రోడ్ల సమస్యలను పరిష్కరించనున్నట్టు చెప్పారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. ఏపీవో చిన్నారావు మాట్లాడుతూ వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి ఉపాధి కూలీల జాబ్‌కార్డుకు విధిగా అధార్ నంబర్, బ్యాంకు అకౌంట్‌తో లింక్ అయి ఉండాలని తెలిపారు. ఇంతవరకు మండల వ్యాప్తంగా 238 మంది ఇంకా అనుసంధానం చేసుకోలేదని చెప్పారు. వారంతా వెంటనే లింక్ చేసుకోవాలని, లేకపోతే వారి అకౌంట్లలో నగదు జమకాదన్నారు. ఈఏడాది ఉపాధి హామీ పథకంలో 100 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకం చేపట్టినట్టు తెలిపారు. ఎకరానికి రూ.90 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఈసీ దేముడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా కాశీ యాత్రకు భక్తులు

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు, అంకంపేట గ్రామంలో పలువురు భక్తులు కాశీ యాత్రకు పయనమయ్యారు. దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది భక్తులు ఉచితంగాకాశీ యాత్రకు తీసుకెళ్తున్నారు. లోవరాజు కుమారులు వీరందరినీ విశాఖపట్నం వరకు బస్సులో పంపించి, అక్కడి నుండి రైలు ప్రయాణం ద్వారా కాశీకి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. తుని తపోవనం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఈ యాత్రను ప్రారంభించారు. లోవరాజు కుమారులు దేవవరపు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే యాత్రా కార్యక్రమంలో దేవవరపు వెంకటేశ్వరరావు, విశ్వనాథుని బద్రీనాథ్, దేవవరపు బుజ్జి, విశ్వనాథుని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదాయాన్నిచ్చే పంటలు సాగుచేయాలి



రైతులతో విత్తనాలు వేయిస్తున్న ప్రకృతి సేద్య సిబ్బంది

మాకవరపాలెం: నిరంతరం ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సూచించారు. నిత్యం ఆదాయం సమకూర్చే దుంప, తీగజాతి, ఆకుకూరలు, కూరగాయలు తదితర పంటలపై మండలంలోని జంగాలపల్లిలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో విత్తనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది రామకృష్ణ, సుదర్శన్, రమణమ్మ పాల్గొన్నారు.

మంగళాపురం ఆనకట్ట మరమ్మతులకు చర్యలు

- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ
- దెబ్బతిన్న ఆనకట్ట పరిశీలన



ఆనకట్ట వద్ద రైతులతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మంగళాపురం ఆనకట్టకు మరమ్మతులు చేయించి, పూర్తి స్థాయిలో సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళాపురం,కుముదాంపేట, విజయరామరాజుపేట తదితర గ్రామాల రైతులతో కలిసి బుధవారం ఆయన ఆనకట్టను పరిశీలించారు. భారీ వర్షాలకు ఉధృతంగా నీరు ప్రవహించడంతో ఆనకట్ట కొట్టుకుపోయిందని, పొలాలకు సాగు నీరు అందడం లేదని పలువురు రైతులు విప్ ధర్మశ్రీకి తెలిపారు. సుమారు పది గ్రామాల రైతులకు ఈ ఆనకట్ట ద్వారా కోనాం రిజర్వేయర్ నీరు పుష్కలంగా అందేదని, ప్రస్తుతం ఆనకట్ట దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతోందని వారు చెప్పారు. గత ఏడాది కోనాం రిజర్వేరు నుంచి నీరు విడుదల చేసినా పొలాలకు నీరందక పంటలు ఎండిపోయి నష్టపోయామని వాపోయారు. వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఆనకట్ట ప్రదేశాన్ని, పంట పొలాలను ధర్మశ్రీ పరిశీలించారు. ఎంపీ నిధులతో ఆనకట్ట మరమ్మతులు పూర్తి చేయించి, సాగు నీరు అందేలా కృషి చేస్తానని విప్ ధర్మశ్రీ తెలిపారు. ఆనకట్ట మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని, పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయంగా సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ధర్మశ్రీ సూచించారు. ఈ కార్యక్రమంలో విజయరామరాజుపేట,మంగళాపురం సర్పంచ్‌లు ఎల్లపు విజయ్‌కుమార్,కంటే పద్మరేఖ వెంకట్,ఎంపీటీసీ పత్తి అప్పలనరసమ్మ,ఉప సర్పంచ్ జగ్గు తదితర్లు పాల్గొన్నారు.

టి.అర్జాపురం హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు



హెచ్ఎం నాయుడు , పీడీ రమేష్‌నాయుడులను సన్మానిస్తున్న కలెక్టర్ ,డీఈవో

రావికమతం: టి.అర్జాపురం హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మంగళవారం విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, డీఈవో వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం నాయుడు, పీడీ రమేష్ నాయుడు అవార్డు అందుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు నేర్పించాలన్న సంకల్పంతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా ఏ పాఠశాలల నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు అధికంగా విద్యార్థులు ఎంపికవుతారో అటువంటి పాఠశాలలను జిల్లాకు ఐదు చొప్పున ఎంపిక చేసి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు పీడీ, పీఈటీలకు అవార్డులను అందజేశారు. టి.అర్జాపురం స్కూల్ నుంచి పలువురు విద్యార్థినీవిద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, విజేతలుగా నిలిచారు. దీంతో ఈ పాఠశాలకు జిల్లాలో ద్వితీయ స్థానం లభించింది.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



గంగబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైస్ఎంపీపీ లక్ష్మి తదితరులు

మాకవరపాలెం: విద్యుత్‌షాక్‌తో ఇటీవల మృతి చెందిన మండలంలోని తామరం గ్రామానికి చెందిన మనబాల గంగబాబు(36) కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. తక్షణ సాయంగా వైఎస్సార్ బీమా పథకం నుంచి రూ.10 వేల నగదు అందజేశారు. మిగిలిన రూ.4లక్షలు మృతుడి భార్య మంగ ఖాతాలో జమ అయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ రుత్తల లక్ష్మి, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పసుపు పళ్లాల ఏర్పాటుతో పంటలకు మేలు



పొలాల్లో పసుపు పళ్లాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

రోలుగుంట: పొలాల్లో పసుపు పళ్లాల ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ నర్సీపట్నం డివిజన్ ఇన్‌చార్జి బత్తి దేవి తెలిపారు. మండలం కొంతలం గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పురుగులు, దోమశాతం ఎంత ఉందో తెలుసుకోవచ్చని, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం పిచికారీతో వాటిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మూదినాయుడు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలతో ముగియనున్న జగనన్న పాల వెల్లువ సర్వే

నాతవరం: జిల్లాలో జగనన్న పాలవెల్లువ సర్వే వచ్చే నెల 5వ తేదీతో ముగుస్తుందని జిల్లా కోఆపరేటివ్ డీసీవో కిరణ్‌కుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె ఓటర్ల జాబితాను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పరిశీలన బాధ్యతలను కలెక్టర్ తనకు అప్పగించినట్టు చెప్పారు. గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో తొలగించిన ఓటర్ల వివరాలను పరిశీలించామని, నాతవరం, మాకవరపాలెం మండలాల్లో తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్న పాల వెల్లువ రెండవ విడత సర్వే జరుగుతోందన్నారు. వచ్చే నెలలో సర్వే ముగించి, మహిళా రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాడి పశువులు కొనుగోలుకు మహిళా రైతుకు రూ.30వేల నుంచి రూ1.65 లక్షల వరకు ఇస్తామని తెలిపారు. జిల్లాలో 76 వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలున్నాయని, వాటి ద్వారా రైతులకు దీర్ఘ,స్వల్ప కాలిక రుణాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. గత ఏడాది సంఘాల ద్వారా సుమారు 20వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ–క్రాప్ నమోదుపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రైతు విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఈ–క్రాప్ నమోదు విధి విధానాలపై అవగాహన కల్పించారు. మండలంలో ఈఏడాది 6,500 మందికి పైగా రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాల్సిఉండగా ఇంతవరకు 4వేల మందికి మాత్రమే చేశామన్నారు. మిగతా రైతులు కూడా వెంటనే చేయించుకోవాలని ఆమె తెలిపారు. ఖరీఫ్ సాగుకు కావలసిన ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

ద్రవ జీవామృతం తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న గుణావతి

రావికమతం: ద్రవ జీవామృతం తయారీపై కొత్తకోట గ్రామంలోని పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ గుణావతి బుధవారం అవగాహన కల్పించారు. కొత్తకోట ప్రకృతి వనరుల కేంద్రంలో పలువురు రైతులకు ద్రవ జీవామృతంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ద్రావణాన్ని పొలంలో జల్లితే మంచి పోషకంగా ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ స్వాతి, పలువురు రైతులు పాల్గొన్నారు.